ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ  వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ : 27.11.2024                                        సమయం 1310 గంటలు

ముఖ్యాంశాలు

1. ప్రముఖ వ్యాపార సంస్థపై వచ్చిన లంచం ఆరోపణలతో సహా వివిధ అంశాలపై రెండవరోజు కూడా పార్లమెంట్ లో ప్రతిపక్షం గందరగోళం సృష్టించడంతో ఉభయ సభలు రేపటికి వాయిదా పడ్డాయి.
2. మిషన్ భగీరథ నీళ్లను వినియోగించేలా ప్రత్యేక అవగాహనా కార్యక్రమం నిర్వహించాలని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు.
3. హైదరాబాద్ బాపూ ఘాట్ అభివృద్ధి కోసం రక్షణ శాఖ పరిధిలోని 222 ఎకరాలను రాష్ట్రప్రభుత్వానికి అప్పగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రాన్ని కోరారు.
4. నదుల అనుసంధానంపై నేషనల్ వాటర్ డెవలప్మెంట్ అథారిటీ వచ్చే నెల 3వ తేదీన ఢిల్లీలో సమావేశం నిర్వహిస్తుంది.

**పార్లమెంట్ - 1**

ప్రముఖ వ్యాపార సంస్థపై వచ్చిన లంచం ఆరోపణలతో సహా వివిధ అంశాలపై ప్రతిపక్షాలు గందరగోళం సృష్టించడంతో పార్లమెంట్ ఉభయ సభలు రేపటికి వాయిదా వేశారు. రాజ్యసభ తొలిసారి వాయిదా పడ్డ అనంతరం ఉదయం 11:30 నిమిషాలకు తిరిగి సమావేశం కాగానే కాంగ్రెస్ వామపక్షాలు డీఎంకే తృణమూల్ కాంగ్రెస్ సమాజ్ వాది పార్టీ , ఆమ్ ఆద్మీ పార్టీ సభ్యులు అవే అంశాలను పదే పదే ప్రస్తావించడంతో సభను రేపటికి వాయిదా వేయవలసి వచ్చింది. అంతకుముందు ఈ ఉదయం సభ సమావేశం కాగానే ప్రతిపక్ష ఎంపీలు ప్రముఖ వ్యాపార సంస్థపై వచ్చిన అవినీతి ఆరోపణలకు సంబంధించి 267 నిబంధన కింద ఇచ్చిన వాయిదా నోటీసులను సభాధ్యక్షుడు తిరస్కరించారు. మణిపూర్ హింసాకాండ ఉత్తర్ ప్రదేశ్

లోని సంభాల్ జిల్లాలో హింసకాండ పై కూడా ప్రతిపక్ష సభ్యులు వాయిదా తీర్మానాలు ఇచ్చారు. లోక్ సభలో ఈ ఉదయం సభ సమావేశం కాగానే కాంగ్రెస్ సమాజ్ వాది పార్టీ డిఎంకె మొదలైన ప్రతిపక్షాల సభ్యులు ప్రముఖ వ్యాపార సంస్థపై అవినీతి ఆరోపణలు , ఉత్తర్ ప్రదేశ్ మణిపూర్ లో హింస మొదలైన అంశాలపై గందరగోళం సృష్టించారు. సభ సజావుగా జరిగేలాగా సహకరించాలని సభ గౌరవాన్ని కాపాడాలని లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా పదేపదే కోరినప్పటికీ సభ్యులు స్పందించకపోవడంతో స్పీకర్ మధ్యాహ్నం 12 గంటల వరకు సభను వాయిదా వేశారు. 12 గంటలకు తిరిగి సమావేశమైనా , అదే పరిస్థితి కొనసాగడంతో లోక్ సభను కూడా రేపటికి వాయిదా వేశారు.

ఎన్.ఎస్.డి.

**సీతక్క – మిషన్ భగీరథ**

మిషన్ భగీరథ నీళ్ళ నాణ్యతను ప్రజలకు వివరించేలా గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజలకు అవగాహన కల్పించాలని పంచాయితీ రాజ్ శాఖ మంత్రి D అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ నీళ్లపై ప్రజలకు విశ్వాసం , అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు. హైదరాబాద్ లో ఈ ఉదయం జరిగిన మిషన్ భగీరథ బోర్డు సమావేశంలో మంత్రి మాట్లాడుతూ , మిషన్ భగీరథ నీళ్లను వినియోగించేలా ప్రచార కార్యక్రమం నిర్వహించాలనీ, ప్రజలు ఆర్వో ప్లాంట్లు , బోర్ నీళ్ల మీద ఆధార పడకుండా చూడాలనీ చెప్పారు. గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి DS లోకేష్ కుమార్, మిషన్ భగీరథ ENC కృపాకర్ రెడ్డి సహా పలువురు ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

MSL

**రేవంత్ రెడ్డి – రాజ్ నాధ్ సింగ్**

హైదరాబాద్ బాపూ ఘాట్ అభివృద్ధి కోసం రక్షణ శాఖ పరిధిలోని 222 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రక్షణ శాఖ మంత్రి రాజ్ నాధ్ సింగ్

ను కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి నిన్న కేంద్ర మంత్రిని కలిసి ఈ మేరకు వినతి పత్రం అందచేశారు. మహాత్మాగాంధీ చితాభస్మాన్ని కలిపిన చోట ఏర్పాటుచేసిన బాపూ ఘాట్‌ను ప్రపంచ స్థాయిలో గాంధీ తత్వాన్ని చాటే కేంద్రంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినందున.. కేంద్రం ఇందుకు సహకరించాలని వినతిపత్రం లో పేర్కొన్నారు.

డెస్క్

**రేవంత్ రెడ్డి – ఎయిర్ పోర్ట్స్**

ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు ను కలిసి రాష్ట్రంలో విమానాశ్రయాల నిర్మాణాలకు కేంద్రం వేగంగా అనుమతులివ్వాలని కోరారు. ఈ మేరకు వరంగల్ లో విమానాశ్రయం ఏర్పాటు.... భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి జిల్లాలలో కూడా విమానాశ్రయం ఏర్పాటు విషయాలపై ఆయన కేంద్ర మంత్రి తో చర్చించారు. కాగా.....వరంగల్ విమానాశ్రయం భూసేకరణ పూర్తయిన తర్వాత... ఎయిర్‌పోర్టు అథారిటీ తరఫున వేగంగా పనులు పూర్తి చేస్తామని కేంద్ర మంత్రిరామ్మోహన్నాయుడు తెలిపారు. కొత్తగూడెం , పెద్దపల్లిల్లో రాష్ట్ర ప్రభుత్వం చూపిన స్థలాలపై సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేస్తామని కేంద్ర మంత్రి ముఖ్యమంత్రికి తెలిపారు.

డెస్క్

**శ్రీధర్ బాబు - పెద్దపల్లి**

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషి చేస్తోందని ఐటీ పరిశ్రమల శాఖమంత్రి డీ. శ్రీధర్ బాబు అన్నారు. పెద్దపల్లి జిల్లా మంథనిలో నిన్న జరిగిన ప్రజా ప్రభుత్వ విజయోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని చెప్పారు. గత ఏడాది కాలంలో ప్రభుత్వం సాధించిన విజయాలను చాటి చెప్పే దిశగా విజయోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని మంత్రి అన్నారు. గడిచిన 10 నెలల్లో 50 వేల ఉద్యోగాలు భర్తీ చేసామని

మంత్రి తెలిపారు.  బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ విద్యార్థులు ఒకే చోట చదువుకునే విధంగా అడవి సోమనపల్లి ప్రాంతంలో  25 ఎకరాల విస్తీర్ణంలో యంగ్ ఇండియా సమీకృత గురుకుల నిర్మాణ పనులు చేపట్టామని  శ్రీధర్ బాబు చెప్పారు. PTC PDPL

**రాజన్న సిరిసిల్ల జిల్లా**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో యాసంగి పంటల సాగుకు వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లాలో   1.77 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని అంచనాలు వేశారు. ఇందులో వరి, మొక్క జొన్న, నువ్వులు, పొద్దుతిరుగుడు, శనగలు, ఇతర పంటలు రైతులు పండిస్తారని అంచనా వేశారు.   జిల్లాలో యాసంగి సాగుకు అవసరమైన   ఎరువులు, విత్తనాలు సిద్ధం చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

పిటిసి రాజన్న సిరిసిల్ల

**సంగారెడ్డి – కుటుంబ సర్వే**

సంగారెడ్డి జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే ముగిసిందని అధికారులు తెలిపారు.      ఉద్యోగులు సేకరించిన సమాచారం కంప్యూటరీకరించడం కూడా సాగుతోంది. సంగారెడ్డి జిల్లాలో 638 గ్రామపంచాయతీలు 8 మున్సిపాలటీల్లో మొత్తం 4 లక్షల 8వేల 631 నివాస గృహాలు ఉన్నాయని .....ఇప్పటి వరకు సేకరించిన సమాచారం             మరో వారం రోజులో కంప్యూటరీకరించడం కూడా పూర్తవుతుందని అధికారులు తెలిపారు.

PTC  SRD

**గోదావరి - కావేరి**

నదుల అనుసంధానంపై నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ అథారిటీ డిసెంబర్ 3వ తేదీన ఢిల్లీలో సమావేశాన్ని నిర్వహిస్తుంది. ఈ సమావేశంలో గోదావరి - కావేరి నదుల అనుసంధానంతో పాటు, దేశంలో చేపట్టిన వివిధ అనుసంధాన ప్రాజెక్టులు , వివిధ రాష్ట్రాల్లో చేపట్టిన  నదీ జలాల

అనుసంధాన ప్రాజెక్టులపై ఆయా రాష్ట్రాలతో చర్చించనుంది. గోదావరి –కావేరి నదుల అనుసంధానికి సంబంధించి తెలంగాణ , చత్తీస్‌గఢ్ల మధ్య ఒప్పందాన్ని ఈ సమావేశంలో ఖరారు చేసే అవకాశం వున్నట్లు తెలుస్తోంది.

డెస్క్

**వరంగల్ – పిహెచ్.సి**

ఆర్టీసీ బస్సులలో తమకు ఉచిత ప్రయాణం కల్పించాలని , ప్రత్యేక సీట్లు కేటాయించి తమకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని కలిగించాలని డిమాండ్ చేస్తూ వరంగల్ జిల్లాలోని దివ్యాంగులు ఈరోజు వినూత్న నిరసన తెలియజేశారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో కొందరు దివ్యాంగులు మహిళల వలె చీరలు కట్టుకొని ఆర్టిసి బస్సు ఎక్కి నిరసన తెలియజేశారు. మహిళలకు ఉచిత బస్సు పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 30 లక్షల మంది దివ్యాంగులు ఆర్టీసీ బస్సు ఎక్కాలంటేనే ఇబ్బంది పడుతున్నారని వారు తెలిపారు.

పిటిసి వరంగల్

**ఖమ్మం – పోటు ప్రసాద్**

కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఈ ఉదయం ఖమ్మంలో మరణించారు. ఈ ఉదయం ఆయన ఖమ్మం పట్టణంలోని ట్యాంక్ బండ్ పై మార్నింగ్ వాక్ చేస్తుండగా గుండెపోటుకు గురయ్యారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు , కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు , సిపిఐ జాతీయ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, ఇతర రాజకీయ పార్టీ నేతలు ప్రసాద్ మృత దేహాన్ని సందర్శించి , పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

పిటిసి ఖమ్మం

**కోల్డ్ వేవ్స్**

రాష్ట్రంలో రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. ఆసిఫాబాద్ జిల్లాలో ఈ ఉదయం అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలోని సిర్పూర్ యు లో 7.9 సెంటీగ్రేడ్ అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు కాగా, తిర్యానిలో 10 డిగ్రీలు , కెరమెరిలో 10.7, గిన్నెదరిలో 11.4, వాంకిడిలో 11.8, జైనూర్ లో 11.9 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు కావడం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు చెబుతున్నారు.

పిటిసి ఆసిఫాబాద్

**ఆసిఫాబాద్ - పులులు**

ఆసిఫాబాద్ జిల్లాలో పెద్ద పులుల సంచారంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. నిన్న సాయంత్రం జిల్లాలోని మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన వాంకిడి మండలంలోని హైవే టోల్ గేట్ వద్ద పులులు సంచరించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వాంకిడి మండలంలోని దాబా గ్రామ సరిహద్దులో మూడు పశువులను పులి గాయ పరిచింది.

PTC ASFBD